
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
జనగామ
ఆదివారం 15 సెప్టెంబరు 2024




దేవాదుల సొరంగం

మన మేధస్సు.. అద్భుతం




ప్రపంచ వారసత్వ సంపదగా వెలుగొందుతున్న రామప్ప దేవాలయం

- అబ్బురపరిచే కట్టడాలకు నిలయం ఓరుగల్లు
- కాకతీయుల కాలం నుంచి నేటి వరకు ఎన్నో విశిష్ట నిర్మాణాలు
- వంతెనలు, భారీ ప్రాజెక్టుల వరకు అన్నింటిలోనూ ఇంజనీర్లే కీలకం
- దేవాదుల ప్రాజెక్టులో 49.6కి.మీ.ల టన్నెల్ ఓ రికార్డు
- 506 మీటర్లపైకి కొండపోచమ్మ వరకు నీటిని లిఫ్ట్ చేసేలా కాళేశ్వరం డిజైన్
- చెక్కుచెదరని నిజాంకాలం నాటి ఇచ్చంపల్లి ప్రాజెక్టు పునాదులు
- మేడారం జంపన్నవాగుపై 37రోజుల్లో వంతెన నిర్మాణం మరో రికార్డు
- ఇప్పటికీ అంతుచిక్కని కాకతీయుల నాటి కళా నైపుణ్యం

Sunday Special

కాకతీయుల కాలమైనా.. ప్రస్తుతమైనా.. ఉమ్మడి వరంగల్ జిల్లా ఎన్నో అద్భుత కట్టడాలకు నిలయం. గొలుసు కట్టు చెరువుల నుంచి నీటిని ఎత్తిపోసే నేటి తరం ప్రాజెక్టుల వరకు అన్నిటిలోనూ అద్భుతాలే. వీటికి తోడు ఎప్పటికీ అంతుచిక్కని ఎన్నో రహస్యాల సమాహారమైన ఆలయాలు ఉన్నాయి. ఓ వైపు భూగర్భంలో అనకొండల్లా కిలోమీటర్ల కొద్ది సాగిపోయే సొరంగాలు.. మరోవైపు శిల్పకళా శోభిత ఆలయాల కట్టడాలను చూస్తే కళ్లు చెదురుతాయి. ఆహా.. ఈ ఇంజనీరింగ్ నైపుణ్యం అమోఘం అనడం ఖాయం. కాకతీయుల కాలంలో నిర్మించిన అనేక గొలుసుకట్టు చెరువులు, సాండ్ బాక్స్ టెక్నాలజీ ప్రపంచాన్నే అబ్బుర పరిస్తే.. దేవాదుల ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన టన్నెల్‌తో పాటు 624 అడుగుల ఎత్తుకు కాళేశ్వర జలాలను తరలించే ఇంజనీరింగ్ డిజైన్‌ను మహాద్భుతంగా అభివర్ణిస్తున్నారు. మేడారంలోని జంపన్నవాగుపై 37రోజుల వ్యవధిలో నిర్మించిన వంతెనకు కితాబివ్వని వారుండరు. వందేళ్లకు ముందెప్పుడో నిర్మించిన ఇచ్చంపల్లి ప్రాజెక్టు పునాదులు ఇప్పటికీ చెక్కు చెదరకుండా నిలవటం నాటి మన ఇంజనీర్ల దూరదృష్టికి నిదర్శనం. ఇలా ఎన్నో విశిష్ట కట్టడాల సమాహారమైన ఓరుగల్లు నిర్మాణాల్లో ఇంజనీరింగ్ నిపుణుల నైపుణ్యం చెక్కుచెదరనిది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్


కాళేశ్వరం ప్రాజెక్టు

'హబ్'ల నిర్వహణపై కలెక్టర్ ఫోకస్

- మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు పర్యవేక్షణ బాధ్యతలు

జనగామ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్(టీ-హబ్), రేడియాలజీ హబ్‌ల నిర్వహణకు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ప్రత్యేక ఫోకస్ పెట్టారు. తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్, రేడియాలజీ హబ్‌లలో సరిపడా టెక్నీషియన్లు, సిబ్బంది లేకపోవడంతో నిర్వహణ కష్టతరంగా మారింది. రోగ నిర్ధారణ చేయాల్సిన పాథాలజిస్టు, బయోకెమిస్ట్, మైక్రోబయాలజిస్ట్, రేడియాలజిస్ట్ వంటి పోస్టులు సైతం ఖాళీగా ఉంటున్నాయి. ఈ క్రమంలో ల్యాబ్ టెక్నీషియన్లే రోగ నిర్ధారణ చేయాల్సి వస్తోంది. ఈ అంశంపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో జూలై 28న 'రోగ నిర్ధారకులేరి?' అన్న శీర్షికతో కథనం కూడా ప్రచురితమైంది. ఈక్రమంలో ఈ అంశంపై కలెక్టర్ దృష్టి సారించారు. ఇదే క్రమంలో తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్, రేడియాలజిస్ట్ హబ్‌ను కలెక్టర్ రిజ్వాన్ బాషా శుక్రవారం తనిఖీ చేశారు. హబ్‌లలో నెలకొన్న సమస్యలను సిబ్బంది ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో వెంటనే స్పందించిన ఆయన ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన అవసరమైన సిబ్బంది నియామకాన్ని చేపట్టాలని మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు సూచించారు. కలెక్టర్ ఆదేశాలతో హబ్‌లు, జిల్లా ఆసుపత్రిలో పనిచేసేందుకు గానూ దరఖాస్తులను ఆహ్వానిస్తూ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా.. తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్, రేడియాలజీ హబ్‌ల పర్యవేక్షణ విషయంలో కొంతకాలంగా సందిగ్ధత ఏర్పడింది. తమ పరిధి కాదంటే తమ పరిధి కాదంటూ అటు డీఎంహెచ్, ఇటు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్లు చెప్పుకుంటూ వచ్చారు. కాగా.. దీనికి చెక్ పెట్టేందుకు గానూ జిల్లా వైద్యారోగ్య శాఖ కింద ఉన్న వీటిని డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) కిందకు చేర్చుతూ కలెక్టర్ నిర్ణయం తీసుకున్నారు. ఇదే క్రమంలో వాటి పర్యవేక్షణ బాధ్యతలను ప్రిన్సిపాల్ గోపాల్‌రావుకు అప్పగించారు. ఆయనతో పాటు ఆయా విభాగాలకు పర్యవేక్షకులుగా పలువురు ప్రొఫెసర్లకు కలెక్టర్ బాధ్యతలు అప్పగించారు. పాథాలజీకి డాక్టర్ అన్వర్, బయోకెమిస్ట్‌కు డాక్టర్ ప్రవీణ్, మైక్రో బయాలజీకి డాక్టర్ జ్యోతి లక్ష్మీ, రేడియాలజీకి డాక్టర్ శ్రీహరికి బాధ్యతలను ఇచ్చారు.

కాజీపేట మీదుగా నాగపూర్‌కు 'వందేభారత్'

రేపటి నుంచి రైలు రాకపోకలు

కాజీపేట, సెప్టెంబరు 14: ఈ నెల 16 నుంచి కాజీపేట మీదుగా వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు నడవనుంది. ఇందుకు రైల్వే అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. నాగ్‌పూర్ - సికింద్రాబాద్‌ల మధ్య నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20101) రైలు ఈ నెల 16న నాగ్‌పూర్‌లో ఉదయం 5 గంటలకు బయలుదేరి కాజీపేట 10.04 నిమిషాలకు చేరుకుంటుంది. సికింద్రాబాద్‌కు 12.15 నిమిషాలకు చేరుకుంటుంది. తిరిగి సికింద్రాబాద్‌లో మధ్యాహ్నం 1 గంటలకు బయలుదేరి కాజీపేట జంక్షన్‌కు 3.20 నిమిషాలకు చేరుకుంటుంది. రాత్రి 8.20 నిమిషాలకు నాగ్‌పూర్‌కు చేరుకుంటుంది. ఈ రైలు సేవాగ్రామ్, చంద్రాపూర్, బల్లార్షా, రామగుండం, కాజీపేట రైల్వే స్టేషన్‌లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

నిమజ్జనానికి భారీగా ఏర్పాట్లు చేపట్టాలి

- అపశృతులకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- నిమజ్జన ఏర్పాట్లపై సీపీ అంబర్‌కిషోర్ ఝా సమీక్ష


నెల్లుట్ల చెరువులో నిమజ్జన ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న సీపీ

లింగాలఘణపురం, సెప్టెంబర్14: నెల్లుట్ల చెరువులో నిర్వహించే గణనాథుడి నిమజ్జనానికి అధికారులు భారీ ఏర్పాట్లను చేపట్టాలని వరంగల్ పోలీస్ కమీషనర్ అంబర్‌కిషోర్ ఝా సూచించారు. జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్‌తో కలిసి సీపీ శనివారం లింగాలఘణపురం మండలం నెల్లుట్ల చెరువును సందర్శించారు. ఈసందర్భంగా జనగామ పట్టణానికి చెందిన గణనాథుడి విగ్రహాలను నెల్లుట్ల చెరువులో నిమజ్జనం చేయనున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ భారీకేడ్ల ఏర్పాటుతో పాటుగా అవసరమైనన్ని విద్యుత్ లైట్లు, క్రేన్లు, తెప్పలు, గజఈతగాళ్ల అందుబాటులో ఉండాలని సూచించారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎలాంటి అపశృతులు దొర్లకుండా జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. వాహనాల రాకపోకలపై క్రమపద్ధతిని పాటించే విధంగా ట్రాఫిక్ చర్యలు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జనగామ ఏసీపీ పార్థసారధి, ఆర్డీవో కొమురయ్య, మున్సిపల్ కమీషనర్ వెంకటేశ్వర్లు, రఘునాథపల్లి సీఐ శ్రీనివాస్‌రెడ్డి, లింగాలఘణపురం ఎస్సై బండి శ్రవణ్‌కుమార్, నీటిపారుదల శాఖాధికారులు, విద్యుత్ శాఖాధికారులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి వార కల్యాణం

పెద్దఎత్తున తరలి వచ్చిన భక్తులు


చిలుపూర్ గుట్ట ఆలయంలో వేంకటేశ్వరుడి కల్యాణం జరిపిస్తున్న పూజారులు

చిలుపూర్, సెప్టెంబరు 14 : మండల కేంద్రంలోని చిలుపూర్ గుట్ట బుగులు వెంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారి వార కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు. శనివారం ఆలయ ఆవరణలో చేపట్టిన కళ్యాణ మహోత్సవానికి జిల్లా నలు మూలల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరు కాగా, ఆలయ ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, సౌమిత్రి రంగాచార్యుల వేదమంత్రాల మధ్య వేంకటేశ్వర స్వామి - పద్మావతి అమ్మవార్ల కల్యాణ వేడుకలను వైభవంగా ముగించారు. కార్యక్రమంలో స్వామివారి నిత్యసేవకులు, ఆలయ అభివృద్ధి శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్ రావు, ధర్మకర్త సంగోజు మోహనాచారి, ఆలయ ఈవో మోహన్‌బాబు, జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, రికార్డ్ అసిస్టెంట్ వీరన్న పాల్గొన్నారు.

రోజారాణికి రైస్ మిల్లర్ల సన్మానం


రోజారాణిని సన్మానిస్తున్న బాయిల్డ్ రైస్ మిల్లర్ ఆసోసియేషన్ నాయకులు

జనగామ సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా పౌరసరఫరా శాఖ అధికారిగా పనిచేసి ఇటీవల యాదాద్రి భువనగిరి జిల్లాకు బదీలపై వెళ్లిన రోజా రాణికి జిల్లా బాయిల్డ్ రైస్ మిల్లర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి డీఎం ప్రకార్‌వర్మ హాజరయ్యారు. ప్రభుత్వ ఉద్యోగికి బదిలీలు సాధారణమని, ఎక్కడ పని చేసినా అంకితభావంతో విధులు నిర్వర్తించాలని ఆయన సూచించారు. జనగామలో పదేళ్లుగా సుదీర్ఘంగా పనిచేసిన రోజారాణి సేవలను రైస్ మిల్లర్లు కొనియాడారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్ వెల్ఫర్ అసోసియేషన్ అధ్యక్షుడు పజ్జూరి జయహరి, వర్కింగ్ ప్రెసిడెంట్ కానుగంటి ముత్తయ్య, కోశాధికారి మర్యాల వెంకన్న, నాయకులు దాస నర్సయ్య, మాశెట్టి సంతోష్, గాదె శ్రీనివాస్, బుక్కా రామయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండో వసంతంలోకి..!

- ఏడాది పూర్తి చేసుకున్న జనగామ మెడికల్ కాలేజీ
- గత ఏడాది సెప్టెంబరు 15న ప్రారంభం
- ఇటీవలే మొదటి ఏడాది పరీక్షలు పూర్తి
- రెండో సంవత్సరానికి అనుమతులు
- కౌన్సిలింగ్ తర్వాత భర్తీ కానున్న మరో 100 సీట్లు



జనగామ మెడికల్ కాలేజీ ముఖద్వారం

జనగామ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జనగామ మెడికల్ కాలేజీకి ఏడాది పూర్తయింది. గత ఏడాది సెప్టెంబరు 15న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ వర్చువల్‌గా జనగామ మెడికల్ కాలేజీని ప్రారంభించారు. జనగామ ప్రాంత ప్రజల డిమాండ్లు, ఎన్నో పోరాటాల ఫలితంగా జనగామ మెడికల్ కాలేజీని ఏర్పాటు చేస్తూ అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2022లోనే మెడికల్ కాలేజీకి నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎన్‌ఎంసీ) అనుమతులు ఇవ్వగా 2023 అక్టోబరు నుంచి ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమయ్యాయి. ఇటీవలే మొదటి సంవత్సరం పరీక్షలు పూర్తి అయ్యాయి. ఎంబీబీఎస్ రెండో సంవత్సరానికి సైతం మరో 100 సీట్లకు ఎన్‌ఎంసీ అనుమతులు జారీ చేసింది. దీంతో అక్టోబరు 1 నుంచి రెండో సంవత్సరం తరగతులు ప్రారంభం కానున్నాయి. ఇదే క్రమంలో కొత్తగా మొదటి సంవత్సరంలో 100 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందనున్నారు. జాతీయ స్థాయి కోటా కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రస్తుతం జరుగుతుండగా రాష్ట్రస్థాయి కోటా విషయంలో కొంత స్తబ్దత నెలకొంది. స్థానికత విషయంలో కోర్టు కేసు ఉన్నందున ఎంబీబీఎస్ మొదటి ఏడాది ప్రవేశాల్లో కొంత ఆలస్యమయ్యే అవకాశం ఉంది.

రూ. 190 కోట్లతో శాశ్వత నిర్మాణాలు

మెడికల్ కాలేజీ శాశ్వత భవనాల నిర్మాణ పనులు ప్రస్తుతం పురోగతిలో ఉన్నాయి. జనగామ మెడికల్ కాలేజీ, విద్యార్థుల హాస్టళ్ల భవనాల నిర్మాణాలను రూ. 190 కోట్లతో చేపట్టారు. జిల్లాకేంద్రంలోని సిద్దిపేట రోడ్డులో ఉన్న 18.23 ఎకరాల హౌజింగ్ బోర్డు స్థలాన్ని మెడికల్ కాలేజీ కోసం అప్పటి ప్రభుత్వం కేటాయించింది. గత ఏడాది మెడికల్ కాలేజీకి ఎన్‌ఎంసీ అనుమతులు ఇవ్వగా శాశ్వత భవనాల నిర్మాణాలు ఆలస్యం అయ్యే అవకాశం ఉండడంతో రూ. 20 కోట్లతో తాత్కాలిక భవనాలను అప్పటికప్పుడు నిర్మించారు. చంపక్‌హిల్స్‌లోని ఎంసీహెచ్ ఆసుపత్రికి పక్కనే అనాటమీ ల్యాబ్‌లను నిర్మించారు. ఈ ల్యాబ్‌లలోనే తాత్కాలికంగా ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం తరగతులను నిర్వహించారు. కాగా.. శాశ్వత భవనాల నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో ఈ ఏడాది కూడా తాత్కాలిక షెడ్లలోనే తరగతులను నిర్వహించాల్సి వస్తోంది.

సమర్థతతో సక్సెస్‌గా..

మెడికల్ కాలేజీని తాత్కాలిక భవనాల్లో నిర్వహించినప్పటికీ ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. కాలేజీ ప్రారంభం సమయంలో కాలేజీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ గోపాల్‌రావును ప్రభుత్వం నియమించింది. బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి ఆయన అటు బోధనాసుపత్రుల సూపరింటెండెంట్లతో, ఇటు మెడికల్ కాలేజీ ఫ్యాకల్టీతో సమన్వయం చేసుకుంటూ విజయవంతంగా తరగతులను నిర్వహించారు. కాలేజీ విద్యార్థుల వసతి కోసం విద్యార్థినులకు జిల్లాకేంద్రంలోని ధర్మకంచ ఎస్సీ బాలికల హాస్టల్, విద్యార్థులకు చంపక్‌హిల్స్‌లోకి డీఆర్‌డీఏ భవనంలో సౌకర్యాలు కల్పించారు. ఈ రెండు వసతి గృహాలు మెడికల్ కాలేజీ స్థాయి హాస్టళ్లలా లేకపోయినప్పటికీ ఇటు విద్యార్థులు, అటు విద్యార్థుల తల్లితండ్రుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా సౌకర్యాలు కల్పించారు. తరచుగా హాస్టళ్ల నిర్వహణపై పర్యవేక్షణ చేస్తుండడంతో ఏడాదిగా ఎలాంటి కంప్లైట్లు రాలేదు. కాగా.. కౌన్సిలింగ్ తర్వాత కొత్తగా మరో 100 మంది విద్యార్థులు రానుండడంతో శామీర్‌పేట శివారులోని కోమటిరెడ్డి సుశీలమ్మ వృద్ధాశ్రమంలో తాత్కాలిక హాస్టల్ ఏర్పాటుకు ఆయన కృషి చేశారు. అటు ఉన్నతాధికారులు, ఇటు కోమటిరెడ్డి సుశీలమ్మ ఆశ్రమ నిర్వాహకులు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి ఎంబీబీఎస్ విద్యార్థినులకు వసతి కల్పించాల్సిందిగా కోరారు. దీంతో అందుకు ప్రభుత్వం అంగీకరించగా విద్యార్థినుల హాస్టల్ సౌకర్యానికి ప్రస్తుతానికి ఎలాంటి ఇబ్బంది ఏర్పడలేదు.

త్వరలో మరో వంద సీట్ల భర్తీ

జనగామ మెడికల్ కాలేజీ ఎంబీబీఎస్ మొదటి సంవత్సరానికి గానూ నేషనల్ మెడికల్ కౌన్సిల్ గత ఏడాది 100 సీట్లకు అనుమతి ఇచ్చింది. ఇందులో 85 సీట్లు రాష్ట్ర కోటా కాగా 15 సీట్లు జాతీయ కోటా

మిగతా 6వ పేజీలో...


నిర్మాణంలో ఉన్న శాశ్వత మెడికల్ కాలేజీ భవనం

నిమజ్జనం వేళ.. జాగ్రత్త సుమా!



గణేష్ విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు (ఫైల్)

జనగామ కల్చరల్, సెప్టెంబరు 14 : ఏ కార్యక్రమం చేపట్టినా ఎలాంటి విఘ్నాలు కలుగకుండా విఘ్నేశ్వరుని వేడుకుంటాం. శుభకార్యాలు, వేడుకలు జరిపే ముందు తొలత గణపతికి పూజలు నిర్వహించి సవ్యంగా జరగాలని కోరుకుంటాం. తొలి పూజలు అందుకునే గణేషుని నవరాత్రోత్సవాలు ఈ నెల 7 నుంచి ప్రారంభమై 16వ తేదీ వరకు ఘనంగా జరుగనున్నాయి. అనంతరం గణేషున్ని నిమజ్జనం చేయనున్నారు. ఎలాంటి అవరోధాలు లేకుండా, అపశృతులు కలుగకుండా నిమజ్జనాలు జరిగేలా ఉత్సవ సమితి సభ్యులు చొరవ తీసుకోవాల్సిన అవసరముంది. పోలీసులు, ఇతర అధికారులు ఇచ్చే సూచనలు పాటించాలని పలువురు కోరుతున్నారు. నిమజ్జనం సమయంలో చెరువుల వద్దకు అధిక సంఖ్యలో ప్రజలు వచ్చే అవకాశం ఉంది. వీరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాల్సి ఉంటుంది. ప్రధానంగా పోలీసులు, విద్యుత్తు, వైద్యం, ఆరోగ్య, పురపాలక సంస్థ అధికారులు అప్రమత్తంగా ఉండాలి. నిమజ్జనం జరిగే ప్రదేశాల్లో గజ ఈతగాళ్లను నియమిస్తున్నారు.

భారీ వర్షాలు...

భారీ వర్షాల నేపథ్యంలో జనగామ జిల్లా వ్యాప్తంగా చెరువులు, కుంటల్లో భారీగా నీరు చేరింది. ఎన్నో చోట్ల వాగులు, కాల్వలు పొంగిపొర్లుతున్నాయి. అందు వల్ల నిమజ్జనం వేళ చెరువుల లోతును అంచనా వేయడం కష్టం. అందువల్ల వాహనాలు దిగబడకుండా చూసుకోవాలి. అదే సమయంలో ఈత వచ్చి న వారు మాత్రమే దిగేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రధానంగా చిన్న పిల్లలను దూరంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

వాహనం పైకి ఎక్కించేటప్పుడు...

భారీ విగ్రహాలను వాహనం పైకి ఎక్కించడం కష్టంతో కూడుకున్న పని. ఎక్కువ మంది భక్తులు అవసరమవుతారు. కాబట్టి వీలైతే చిన్నపాటి క్రేన్‌లు అందుబాటులో ఉంటే వాటితో ఎక్కించాల్సి ఉంది.

◆ ప్రతీ వాహనంలో ప్రథమ చికిత్స కిట్టు అందుబాటులో ఉంచుకోవాలి. ◆ విగ్రహాలను పట్టుకోవడం, తీర్థప్రసాదాల పంపిణీ బాధ్యతలు పిల్లలకు అప్పగించరాదు. వాహనం కుదుపునకు గురైతే కిందపడే ప్రమాదం ఉంది. ◆ క్రేన్ సహాయంతో విగ్రహాలను నిమజ్జనం చేయాలని నిపుణులు తెలుపుతున్నారు.

ఊరేగింపు సందర్భంగా సూచనలు

◆ స్వామి వారి ఊరేగింపులో ప్రమాదకర నృత్యాలు చేయొద్దు ◆ డీజేలకు అతి దగ్గరగా ఉండకూడదు. భారీ శబ్దంతో గుండె లయ తప్పే ప్రమాదముంది. ◆ మార్గమధ్యలో రహదారికి అడ్డంగా, కిందికి వేలాడుతూ ఉండే విద్యుత్తు తీగలతో ప్రమాదం పొంచి ఉంటుంది. తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ◆ మద్యం, మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు. గొడవలకు తావివ్వొద్దు. ◆ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. పోలీసులకు సహకరించాలి. ◆ అనుకోని సంఘటనలు ఏవైనా జరిగితే వెంటనే 100, 108కి కాల్ చేయాలని పోలీసులు కోరుతున్నారు. .

అధికారులు చేపట్టాల్సినవి ..

◆ కిందికి వేలాడుతున్న విద్యుత్తు తీగలనను సవరించి రోడ్డు పక్కన ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలి. ◆ ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు రహదారులపై గుంతలు ఏర్పడి బురదగా మారాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితులు మరీ ఎక్కువగా ఉన్నాయి. మొరం, మట్టి పోసి వాటిని చదును చేయాలి. ◆ నీటి వనరులు అనగా నిమజ్జనం చేసే చెరువులు, కుంటలు, వాగులు మొదలగు వాటి వద్ద విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలి. ◆ పోలీసుల బందోబస్తుతో పాటు గజ ఈతగాళ్ల అందుబాటులో ఉండేలా చూడాలి. ◆ లోతుగా ఉండే ప్రాంతానికి వెళ్లకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

◆ నిమజ్జనం కోసం వెళ్లే వాహనాలు పోలీసులు సూచించిన మార్గంలోనే వెళ్లాలి. నిమజ్జనం పూర్తయిన తరువాత తిరిగి మరో మార్గంలో రావాలి. ◆ చిన్న పిల్లలు, యువకులను పెద్దలు కనిపెడుతూ ఉండాలి. ◆ ఊరేగింపు, సమయంలో మద్యం సేవించరాదు. ◆ రోడ్ల పక్కన ఉండే భవనా లపై, చివర్లో నిల్చొని లేదా కూర్చొని ఉత్సవాలు చూడవద్దు. కింద పడే అవకాశాలు ఉన్నాయి.

పీహెచ్‌డీ అడ్మిషన్లకు పచ్చజెండా

- సీఎస్ఐఆర్, జేఆర్ఎఫ్, నెట్ ఉత్తీర్ణత తప్పనిసరి
- డీన్ మనోహర్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 14: కేయూలో పీహెచ్‌డీ అడ్మిషన్లకు పీజీ అభ్యర్థులంతా ఇక నుంచి తప్పనిసరిగా యూజీసీ సీఎస్ఐఆర్, జేఆర్ఎఫ్, నెట్ ఉత్తీర్ణను తప్పనిసరి చేయనుంది. దేశవ్యాప్తంగా న్యూఢిల్లీలోని యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యూజీసీ) పీహెచ్‌డీ అడ్మిషన్లకు జాతీయ అత్యున్నత సంస్థ నిర్వహించే నెట్ పరీక్షలు తప్పనిసరి చేసింది. దేశవ్యాప్తంగా యూజీసీ గుర్తింపు పొందిన వర్సిటీలన్నింటికీ మార్గదర్శకాలను రూపొందించింది. తమ ఆదేశాల మేరకు అన్ని వర్సిటీలు పీహెచ్‌డీ అడ్మిషన్లలో ప్రత్యేక ప్రవేశ పరీక్షలు రద్దు చేసి సీఎస్ఐఆర్, జేఆర్ఎఫ్, నెట్ ఉత్తీర్ణత మేరకు సీట్లు కేటాయించాలని ఆదేశాలు జారీ చేసింది. యూజీసీ మార్గదర్శకాల నేపథ్యంలో వర్సిటీ ఉన్నతాధికారులు విధి విధానాలు రూపొందించేందుకు కేయూ సోషల్‌సైన్స్ డీన్ తాళ్లపల్లి మనోహర్, ఛైర్మన్‌గా జియాలజీ విభాగాధిపతి మల్లికార్జున్‌రెడ్డి, ఇంజనీరింగ్ విభాగం డీన్ ఎం సదానందం, అకాడమిక్ విభాగం అసిస్టెంట్ రిజిస్ట్రార్ కోలా శంకర్ ఆధ్వర్యంలో కమిటీని నియమించారు. కమిటీ ఇప్పటికే యూజీసీ నిబంధనలు ఏమీ చెబుతున్నాయి. మార్గదర్శకాలు ఏవిధంగా రూపొందించాలనే అంశంపై చర్చించింది.

పీహెచ్‌డీ ఎంట్రెన్స్ రద్దు

కేయూ ప్రత్యేకంగా పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం ఎలాంటి ఎంట్రెన్స్ నిర్వహించదు. జాతీయ స్థాయి జేఆర్ఎఫ్ అభ్యర్థులకు అన్ని విభాగాల్లో మొట్టమొదటి ప్రాధాన్యత కల్పించి అడ్మిషన్లు కల్పిస్తారు. జేఆర్ఎఫ్ తర్వాత నెట్ ఉత్తీర్ణతలో వచ్చిన మెరిట్ మేరకు అడ్మిషన్లు కల్పిస్తారు. ఏడాదికి రెండు దఫాలుగా జాతీయస్థాయిలో నెట్ పరీక్షలు జరుగుతాయి. నెట్ పరీక్షల ఫలితాలు రాగానే అర్హులైన అభ్యర్థులు నేరుగా దరఖాస్తులు చేసుకుంటే అడ్మిషన్లు కల్పించే వీలుంది. అభ్యర్థులు ప్రత్యేకంగా పీహెచ్‌డీ నోటిఫికేషన్‌కు ఎదురు చూడాల్సిన అవసరం ఉండదు. నెట్ పాసైన వెంటనే అడ్మిషన్లు పొందవచ్చు.

జేఆర్ఎఫ్, నెట్‌కు కుస్తీ పట్టాల్సిందే..

జాతీయస్థాయిలో ప్రతీ సబ్జెక్టులో నెట్ పరీక్షలు నిర్వహిస్తారు. ఇంగ్లిష్, హిందీ భాషల్లో రెండు పేపర్లుంటాయి. మొదటి పేపర్ జనరల్ నాలెడ్జ్, కంప్యూటర్ పరిజ్ఞానం, ప్రాథమిక గణిత సామర్థ్యాలు, లోక పరిజ్ఞాన అంశాలుంటాయి. మొదటి పేపర్‌లో అర్హులైన అభ్యర్థుల రెండో పేపర్‌ను వాల్యూయేషన్ చేస్తారు. రెండో పేపర్ మొత్తం సంబంధిత అభ్యర్థి ఎంచుకున్న అంశంలో ఉంటుంది. సైన్స్ అభ్యర్థులకు సీఎస్ఐఆర్ అని, ఆర్ట్స్, సోషల్ సైన్స్ ఇతర సబ్జెక్టుల అభ్యర్థులందరికీ నెట్ పరీక్షలని పిలుస్తారు. దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ విధానంలో ఏడాదికి రెండు దఫాలుగా యూజీసీ సీఎస్ఐఆర్, నెట్ ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తారు. పీజీ ఫైనలియర్‌లో ఉన్న అభ్యర్థులను కూడా నెట్, సీఎస్ఐఆర్ ప్రవేశ పరీక్షలకు అనుమతిస్తారు. జేఆర్ఎఫ్‌కు వయసు పరిమితి విధించారు. నెట్ ఉత్తీర్ణతకు మాత్రం ఎలాంటి వయసు పరిమితి ఉండదు. ఉత్తీర్ణులయ్యే వరకు పరీక్షలు రాసే వెసులుబాటు కల్పించారు. నెట్ పరీక్షల కోసం కేయూలో ఉచితంగా కోచింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

కొత్త వీసీ రాగానే నోటిఫికేషన్

యూజీసీ నిబంధనల మేరకు పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం రూపొందించిన విధి విధానాల నోటిఫికేషన్ కొత్త వీసీ రాగానే జారీ కానుంది. యూజీసీ నిబంధనలన్నీ ఉన్నది ఉన్నట్లుగా అడాప్ట్ చేసుకునే అధికారం వీసీకి ఉంది. రానున్న 15 రోజుల్లో రాష్ట్రంలోని అన్ని వర్సిటీలకు నూతన వీసీలను నియమిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించిన విషయం తెలిసిందే. వీసీలు రాగానే యూజీసీ పీహెచ్‌డీ అడ్మిషన్లు ప్రక్రియకు అధికారికంగా పచ్చజెండా ఊపుతారని వర్సిటీ అధికార వర్గాలు వెల్లడించాయి.

పురుగుల మందు తాగిన వృద్ధురాలి మృతి

డోర్నకల్, సెప్టెంబరు 14 : ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన డోర్నకల్‌లోని లచ్యాతండాలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. లచ్యాతండాకు చెందిన తేజావత్ బీబు (60) సుభాష్ వీధిలో నివాసముంటున్న రైల్వే ఉద్యోగి లింగంపల్లి రాజేష్ ఇంటిలో పనిచేస్తుంది. ఈనెల 13న రాజేష్ ఇంటిలో రోజువారి పనులు ముగించుకుని తన ఇంటికి వెళ్లింది. అదేరోజు సాయంత్రం మళ్లీ రాజేష్ ఇంటికి రాగా ఇంట్లో ఉన్న రూ.15 వేలు నగదు పోయిందని, ఆమె తీసిందని ఆవేశంతో రాజేష్, అతడి భార్య అమల బీబుపై చేయి చేసుకున్నారు. మనస్తాపం చెందిన బీబు ఇంటికి వెళ్లి పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇంటికి వచ్చిన ఆమె కుమారుడు రమేష్ బీబును చికిత్స కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ బీబు మృతి చెందింది. మృతురాలి కుమారుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జిన్నెల వాగులో గల్లంతైన వ్యక్తి మృతి

బయ్యారం, సెప్టెంబరు 14 : వాగులో గల్లంతైన వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైనట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నామాల పాడు పంచాయతీ ధర్మాపురానికి చెందిన పూనెం వెంకన్న (45) కూలీ పని చేస్తూ జీవిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం బయటకు వెళ్లి వస్తానని భార్య శృతితో చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. అనంతరం ఎంతకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు సమీప ప్రాంతాలు వెతక సాగారు. ఈ క్రమంలోనే గ్రామ సమీపంలోని జిన్నెల వాగు ఒడ్డున వెంకన్నకు సంబంధించిన చెప్పులు, టవల్ కనిపించడంతో ప్రమాదవశాత్తు వెంకన్న వాగులో గల్లంతై ఉంటాడనే అనుమానంతో రెండురోజుల పాటు గజ ఈతగాళ్లతో వెతికించారు. శనివారం వెంకన్న మృతదేహం లభ్యమైంది. మృతురాలి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి పేర్కొన్నారు.


కుడా చైర్మన్ వినతిపత్రం అందిస్తున్న కళాకారులు

కళాకారులకు గుర్తింపు ఇవ్వాలి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 14: హనుమకొండలో ప్రారంభమయ్యే కాళోజీ కళాక్షేత్రంలో కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ప్రభుత్వ గుర్తింపు పొందిన కళాసంస్థలకు ఉచితంగా ఇవ్వాలని తెలంగాణ నాటక కళా సమితి నాయకులు, కళాకారులు శనివారం కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. కుడా కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఆడిటోరియంలో కళాకారులు మేకప్ చేసుకునేందుకు ప్రత్యేక డ్రెస్సింగ్ రూమ్, స్టేజీ డెకరేషన్, గ్రీన్‌రూమ్, రిహార్సల్స్ గదులు ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో తెలిపారు. చైర్మన్‌ను కలిసిన వారిలో తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల సదానందం, కాకతీయ నాటక కళాపరిషత్ జిల్లా అధ్యక్షుడు రాదారపు సంజీవరెడ్డి, కళాకారులు చక్రపాణి, బాలాజీ, రమేష్, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, అశోక్‌కుమార్, బిక్షపతి, శంకర్, గణేశ్‌తో పాటు కళాకారులు పాల్గొన్నారు.

నిమజ్జన వేళ.. మద్యం షాపులు బంద్

వరంగల్ క్రైం, సెప్టెంబరు 14: గణేష్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ఈనెల 16వ తేదీ ఉదయం 6గంటల నుంచి 17వ తేదీ ఉదయం 6గంటల వరకు మద్యం విక్రయాలు నిలిపివేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో సూచించారు. గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా పూర్తి చేసేందుకు మద్యం షాపులు బంద్ చేయాలన్నారు. మద్యం సరఫరా చేసే బార్‌లు, క్లబ్‌లు, హోటళ్లు మూసివేయాలని అంబర్ కిషోర్‌ఝా సూచించారు. ఎవరైనా మద్యం షాపులు తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నేడు ఆకాశవాణిలో ఎంపీ కావ్యతో ముఖాముఖి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 14: వరంగల్ ఆకాశవాణి ఎఫ్‌ఎం బ్యాండ్ 103.5 మెగా హెడ్జ్‌పై ఆదివారం ఉదయం 7.15నిమిషాలకు వరంగల్ ఎంపీ కడియం కావ్యతో ముఖాముఖి కార్యక్రమం ప్రసారం జరుగుతుందని కార్యక్రమ నిర్వాహకులు ఇల్లెందుల రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కడియం కావ్య జీవన ప్రయాణంలో అనేక విషయాలు.. అనే అంశంపై ప్రసారం ప్రారంభం అవుతుందని తెలిపారు.

తైక్వాండోలో శశాంక్‌కు కాంస్యం

న్యూశాయంపేట, సెప్టెంబరు 14: తమిళనాడులో ఈ నెల 10 నుంచి 13 వరకు జరిగిన సీబీఎస్‌ఈ సౌత్‌జోన్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో న్యూశాయంపేటకు చెందిన గుజ్జేటి త్యాగరాజు కుమారుడు శశాంక్ కాంస్య పతకం సాధించాడు. శనివారం టోర్నీ నిర్వాహకుల నుంచి శశాంక్ కాంస్య పతకం అందుకున్నాడు. హనుమకొండలోని సెయింట్ పీటర్స్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న శశాంక్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ కోచ్ వీ నరసింహ పర్యవేక్షణలో 6 నెలలు శిక్షణ తీసుకున్నాడు.



నిర్వాహకుల నుంచి కాంస్య పతకం తీసుకుంటున్న విద్యార్థి శశాంక్

మన మేధస్సు.. అద్భుతం

- అబ్బురపరిచే కట్టడాలకు నిలయం ఓరుగల్లు
- కాకతీయుల కాలం నుంచి నేటి వరకు ఎన్నో విశిష్ట నిర్మాణాలు
- వంతెనల నుంచి భారీ ప్రాజెక్టుల వరకు అన్నిటిలోనూ ఇంజనీర్లే కీలకం
- నేడు ఇంజనీర్స్ డే

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కళ్లు చెదిరే ఎన్నో కట్టడాలకు నెలవు ఉమ్మడి వరంగల్ జిల్లా. కాకతీయుల కాలం నాటి గొలుసు కట్టు చెరువుల నుంచి ఈ తరం వారు నిర్మించిన ప్రాజెక్టుల వరకు అన్నిటిలోనూ అద్భుతాలే. అంతేకాదు ప్రపంచాన్ని సైతం అబ్బురపరిచే ఆలయాల నిర్మాణం, దేవాదుల ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన టన్నెల్ నిర్మాణంతో పాటు 624 అడుగుల ఎత్తుకు కాళేశ్వర జలాలను తరలించే ఇంజనీరింగ్ డిజైన్‌ను మహా అద్భుతంగా చెబుతున్నారు. మేడారంలోని జంపన్నవాగుపై 37రోజుల వ్యవధిలో నిర్మించిన వంతెనకు కితాబివ్వని వారుండరు. వందేళ్లకు ముందెప్పుడో నిర్మించిన ఇచ్చంపల్లి ప్రాజెక్టు పునాదులు ఇప్పటికి చెక్కు చెదరకుండా నిలవటం ఆనాటి మన ఇంజనీర్ల దూరదృష్టికి నిదర్శనం. అంతేకాదు కాకతీయుల కాలంలో నిర్మించిన అనేక గొలుసుకట్టు చెరువులు, సాండ్ బాక్స్ టెక్నాలజీ ప్రపంచాన్నే అబ్బుర పరిచింది.

అసియాలోనే అతిపెద్ద టన్నెల్

ఉమ్మడి వరంగల్ జిల్లాకు వరప్రదాయనిగా భావించే దేవాదుల ప్రాజెక్టు నిర్మాణాన్ని ఓ అద్భుతంగా చెబుతారు. 2003లోనే మన ఇంజనీర్లు రూపొందించిన దేవాదుల ఎత్తిపోతల పథకానికి అసియాలోనే అతిపెద్ద ప్రాజెక్టుగా పేరుంది. మూడు దశలుగా విభజించి నిర్మించిన ఈ ప్రాజెక్టు పూర్తయితే ఏడాదంతా నీటిని ఎత్తిపోసేలా డిజైన్ చేశారు. సుమారు 6లక్షల ఎకరాలకు సాగు నీరందించే ఈ దేవాదుల ప్రాజెక్టులో భాగంగా మూడవ దశలో టన్నెల్‌ను నిర్మించారు. ఈ అతిపెద్ద సొరంగాన్ని ములుగు జిల్లా జాకారం నుంచి హనుమకొండ జిల్లా దేవన్నపేట వరకు 49.6కిలో మీటర్ల వరకు నిర్మించారు. ఎన్నో అవాంతరాలను ఎదుర్కొంటూ వందలాది మంది ఇంజనీర్ల కృషితో విజయవంతంగా సుదీర్ఘకాలం పాటు టన్నెల్ నిర్మాణం సాగింది. ఈ సొరంగం నుంచి దేవాదుల ఎత్తిపోతల ద్వారా గోదావరి జలాలను తరలించనున్నారు. దేవన్నపేట రిజర్వాయర్ వద్ద నిర్మించిన అతిపెద్ద సర్జ్‌పూల్‌ను 25మీటర్ల డయాతో 135మీటర్ల లోతున్న బావితరహాలో నిర్మించగా, 141 మీటర్ల లోతులో ఏర్పాటు చేసిన పంపుహౌస్ కూడా ఓ రికార్డే. ఇంత పెద్ద సొరంగం నిర్మాణాన్ని డిజైన్ చేసిన ఇంజనీర్ల ప్రతిభను ప్రశంసించని వారు లేరు. టన్నెల్ పనులు ఆలస్యమైనా ఇంత పెద్ద సొరంగాన్ని తవ్వి గోదావరి జలాలను తరలించటం సాధారణ విషయం కాదనే చర్చ ఉంది. ఇందులో వినియోగించిన యంత్రాలు విదేశీవే అయినప్పటికి మేదస్సు మాత్రం మన ఇంజనీర్లదే కావడం విశేషం.

ఇచ్చంపల్లి... అచ్చాహై..

నిజాం కాలంలోనే అప్పటి హైదరాబాద్ రాష్ట్రంతో పాటు మధ్యప్రదేశ్, మహారాష్ట్రల సాగు, తాగు నీరు, విద్యుత్ అవసరాలను తీర్చేందుకు ఇచ్చంపల్లి ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. భూపాలపల్లి జిల్లా పలిమెల మండలం ఇచ్చంపల్లి వద్ద గోదావరిపై ఈ భారీ ప్రాజెక్టుకు నిజాం సర్కారు శ్రీకారం చుట్టింది. 1860లోనే ఫ్రెంచ్ దేశానికి చెందిన 30మంది ఇంజనీర్ల సహకారంతో హైదరాబాద్ ఇంజనీర్లతోపాటు 3వేల మందికి పైగా కూలీలు ఈ ప్రాజెక్టు పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో ప్లేగు వ్యాధి వ్యాప్తి చెంది పనులు చేస్తున్న 20ఫ్రెంచ్ ఇంజనీర్లు, 2వేల మందికి పైగా కూలీలు మృత్యువాత పడ్డారు. దీంతో ప్రాజెక్టు పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. అయితే వందేళ్లు దాటిన ఇప్పటికి ఇచ్చంపల్లి వద్ద అసంపూర్తిగా ఉన్న నాటి కట్టడాలు చెక్కుచెదరలేదు. గోదావరిలో రాళ్లతో నిర్మించిన తాత్కాలిక రోడ్డు ఇంకా పటిష్ఠంగానే ఉంది. ఛత్తీస్‌గఢ్ వైపు చేపట్టిన బండ్ ఇంకా బలీయంగా కనిపిస్తుందంటే నాటి ఇంజనీరింగ్ తీరుపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.


మేడారం జంపన్న వాగుపై నిర్మించిన జంట వంతెనలు

జంపన్నవాగుపై వంతెన ఓ అద్భుతం..

మేడారం జాతరలో 2002కు ముందు జంపన్నవాగుపై ఎలాంటి వంతెనలు లేవు. దీంతో భక్తులు వాగు దాటి జాతరకు వచ్చేవారు. తాత్కాలికంగా పైపుల అమర్చి, వాటిపై ఇసుక బస్తాలను వేసి రోడ్డు వేసేవారు. అయితే 2002లో టీడీపీ హయాంలో అప్పటి కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి రూ.1.89కోట్లతో వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. అప్పట్లో నక్సలైట్ల నుంచి బెదిరింపులు వచ్చినా తట్టుకుని ఇంజనీర్లు మేడారం అడవుల్లోనే మకాం వేసి 37రోజుల్లో వంతెన నిర్మాణం పూర్తి చేశారు. అతితక్కువ కాలంలో ప్రతికూల పరిస్థితుల్లో ఇంజనీర్లు తమ ప్రతిభ చాటారు. 2014లో మరో వంతెనను ఇంజనీర్ల చాలెంజ్‌గా తీసుకుని దాన్ని కూడా 37రోజుల్లోనే పూర్తి చేసి మొదటి వంతెన రికార్డును సమం చేశారు. మన ఇంజనీర్ల కృషితో నిర్మాణమైన జోడు వంతెనలు మహాజాతరకు వన్నె తెస్తున్నాయి.

నేడు ఇంజనీర్స్ డే

ఏటా సెప్టెంబరు 15న ఇంజనీర్స్ డే జరుపుకొంటారు. తొలి ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య కర్నాటకలోని ముద్దెనహళ్లిలో 1861 సెప్టెంబరు 16న జన్మించారు. మైసూరు దివాన్‌గా 1912 నుంచి 1919 వరకు పని చేశారు. దేశంలో అనేక నదులపై వంతెనలు, ఆనకట్టలను నిర్మించి నీటిపారుదల, తాగునీరు పథకాల ద్వారా జలవనరులను సద్వినియోగానికి కృషిచేసిన ఆయనకు కర్ణాటకలోని కృష్ణరాజ సాగర్ ఆనకట్ట నిర్మాణం పేరు తెచ్చింది. ఇక ఆయన హైదరాబాద్ డ్రెయినేజీ వ్యవస్థకు రూపకల్పన చేశారు. విశాఖపట్నం పోర్టు సముద్రం వల్ల కోతకు గురికాకుండా చేయగలిగారు. ఈ నేపథ్యంలో ఆయన సేవలను గౌరవిస్తూ ఏటా ఆయన జయంతి రోజున ఇంజనీర్స్‌డేగా జరుపుకొంటున్నారు.

ప్రపంచంలోనే గొప్ప డిజైన్ కాళేశ్వరం సొంతం

కాళేశ్వరం పాజ్రెక్టు ఓ అద్భుత నిర్మాణం. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో తెలంగాణ ఇంజనీర్ల నైపుణ్యం.. మేధస్సు స్పష్టంగా కనిపిస్తుంది. గతంలో ఉన్న ప్రాణహిత, చేవేళ్ల ప్రాజెక్టును తెలంగాణ ఇంజనీర్లు రీడిజైన్ చేసి కాళేశ్వరం ప్రాజెక్టును రూపొందించారు. మహారాష్ట్ర నుంచి తెలంగాణలో కాళేశ్వరం వద్ద గోదావరిలో కలుస్తున్న ప్రాణహిత నది నీటిని మళ్లించేలా ఈ రీ డిజైన్ జరిగింది. సముద్ర మట్టానికి మేడిగడ్డ 100 మీటర్ల ఎత్తులో ఇది ఉండగా.. ఇక్కడి నుంచి 624మీటర్ల ఎత్తులో ఉన్న కొండపోచమ్మ సాగర్ వరకు నీటిని ఎత్తిపోయాలి. అంటే సుమారుగా ఆర కిలో మీటర్‌కు పైగా ఎత్తుకు నీటిని ఎత్తిపోసేలా కాళేశ్వరం ప్రాజెక్టును డిజైన్ చేశారు. ఇది సాగునీటిరంగంలోనే ఓ గొప్ప ఆవిష్కరణగా నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. అయితే ఇటీవల కాలంలో కాళేశ్వరం ప్రాజెక్టులో నాణ్యత లోపాలు, ఇతర కారణాలపై ఆరోపణలు, విమర్శలు ఉన్నా మన ఇంజనీర్ల పనితీరు మాత్రం అద్భుతమనే చర్చ ఉంది. ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఓ సవాల్‌గా తీసుకున్న ఇంజనీర్లు ప్రాజెక్టు పూర్తి చేయటమే లక్ష్యంగా కుటుంబాలను కూడా వదిలి పనిచేశారు. ఎండ, వాన, చలి, రాత్రి, పగలు అనేది లేకుండా మూడు షిప్టుల్లో పనులు చేశారు. ఇంటి వద్ద ఎవరికైనా అనారోగ్యం వచ్చినా 'ఎలాగోలా అడ్జెస్ట్ చేసుకోండి. ఇక్కడ పని బాగా ఉంది. అర్థం చేసుకొండి' అంటూ తమ వారికి సర్ధిచెప్పుకొన్న సందర్భాలు అనేకం ఉన్నాయని ఇంజనీర్లు గుర్తు చేసుకుంటున్నారు. మేధస్సు మాత్రమే కాదు వారి అంకుతిత దీక్ష కూడా అద్భుతమేనని మన్ననలు అందుకున్నారు.

కాకతీయ ఇంజనీరింగ్ సూపర్...

ఇసుక పునాదులు.. నీటిపై తేలియాడే ఇటుకలు.. భూకంపాలను తట్టుకునేలా శాండ్‌బాక్స్ సాంకేతికతతో రామప్ప ఆలయాన్ని నిర్మించారు. ఇప్పటి ఇంజనీర్లకు కూడా అంతు చిక్కని సాంకేతికత కాకతీయులది. ప్రపంచవ్యాప్త వారసత్వ గుర్తింపు పొందిన రామప్ప ఆలయ నిర్మాణం మహా అద్భుతంగా ఇంజనీర్లు పేర్కొంటారు. ఇసుక పునాదులతో రామప్ప ఆలయాన్ని నిర్మించారు. శాండ్‌బాక్స్ టెక్నాలజీతో రామప్పతో వెయ్యి స్తంభాల ఆలయాన్ని నిర్మించారు. ఎంత పెద్ద భూకంపాలు వచ్చిన తట్టుకునేలా ఈ శాండ్‌బాక్స్ టెక్నాలజీని అప్పటి ఇంజనీర్లు వినియోగించినట్టు చెబుతారు. అంతే కాకుండా నీళ్లలో తేలియాడే ఇటుకలను కూడా రామప్ప ఆలయ గోపురంపైన వాడారు. ఏనుగు పేడ, తవుడు, కరక్కాయ, చెట్ల జిగురుతో ఇటుకలను తయారు చేసి గోపురం నిర్మాణానికి వినియోగించారు. ఇప్పటికీ నీటిలో తేలియాడే ఇటుకలతో గోపురం చెక్కుచెదరకుండా ఉంది. ఇది అప్పటి కాకతీయ ఇంజనీర్ల సత్తా. అంతేకాకుండా వేలాది గొలుసుకట్టు చెరువుల నిర్మాణం కాకతీయ ఇంజనీర్ల మేదస్సుకు నిదర్శనంగా నిలుస్తాయి. ఓరుగల్లు గడ్డపై ఇంజనీర్ల అమోఘ ప్రతిభను కనబరిచారు.


మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

హరికోట్ల రవిపై విచారణ జరిపి చర్య తీసుకోవాలి

రాంనగర్, సెప్టెంబరు 14: మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్, వరంగల్ జిల్లా రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించిన హరికోట్ల రవి అక్రమాలకు పాల్పడ్డారని, విచారణ జరిపి అతడిపై చర్య తీసుకోవాలని విద్యార్థి సంఘాల నేతలు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. శనివారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసిన టీఎస్‌ఎఫ్, డీఎంఎస్‌ఏ నేతలు సుదీర్ఘకాలం వరంగల్‌లో పనిచేసిన రవి అక్రమ రిజిస్ట్రేషన్‌లు చేసి భారీగా వసూళ్లకు పాల్పడ్డారని, అతడిపై చర్య తీసుకోవాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో నేతలు డి.నరేష్, కె.సునిల్, వంశీకృష్ణ ఉన్నారు.

పేకాట శిబిరంపై దాడి

31వేల నగదు స్వాధీనం

వరంగల్ క్రైం, సెప్టెంబరు 14: ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాబా రియల్ ఎస్టేట్ కార్యాలయంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడి చేసి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని రూ.31వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. విచారణ నిమిత్తం ఆరుగురిని ఇంతేజార్‌గంజ్ పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ పవన్‌కుమార్ ధ్రువీకరించారు.

జీవిత భాగస్వామికో ప్రశంస..

- హ్యాపీ వైఫ్.. హ్యాపీ లైఫ్
- 'ఆమె' శ్రమను గుర్తించేది మాత్రం అతితక్కువ మందేనట
- కొంత సమయం కూడా మాట్లాడని వారెందరోనని అభిప్రాయాలు
- నేడు భార్యను ప్రశంసించే రోజు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

భార్య.. భర్తలో సగభాగమే కాదు. ప్రతీ కష్టంలోనూ తోడుండే ఏకైక బంధం. మూడు ముళ్లు పడినప్పటి నుంచి జీవిత చరమాంకం వరకు తోడుగా వచ్చే భార్య భర్త కష్టసుఖాలను అర్థం చేసుకుంటూ కుటుంబ భారాన్ని మోస్తుంది. అలాంటి భార్య శ్రమను గుర్తించే మగవారు మాత్రం అతితక్కువ మందే ఉంటున్నారట. ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో అసలు భార్యతో కొంత సమయం కేటాయించి మనసువిప్పి మాట్లాడని వారు ఎందరో ఉన్నారట. అయితే కుటుంబ బాధ్యతలను భుజాన వేసుకుంటూ ఎంతో కష్టపడే భార్య.. తన భర్త నుంచి ఒక్క ప్రశంస వస్తే చాలు అనుకుంటుందట. ఆ ఒక్క ప్రశంసతో తన కష్టాన్నే మరిచిపోతుందట. అందుకే ఏటా సెప్టెంబరు నెలలో వచ్చే మూడో ఆదివారాన్ని భార్యను ప్రశంసించే రోజులుగా జరుపుకొంటున్నారు. వాస్తవానికి ఈ రోజును ఎందుకు, ఎప్పటి నుంచి జరుపుకుంటున్నారో తెలియదు కానీ.. 2006 సెప్టెంబరు మూడో ఆదివారం నుంచి అధికారికంగా అంతర్జాతీయంగా భార్యను ప్రశంసించే రోజు నిర్వహిస్తున్నారు. మన సంస్కృతి సంప్రదాయాల్లో ఇది అంతగా వెలుగులోకి రాలేదు కానీ కొన్ని దేశాల్లో మాత్రం భర్తలు తమ భార్యలతో ప్రత్యేకంగా సమయాన్ని కేటాయిస్తున్నట్టు తెలుస్తోంది.

లైఫ్‌లో బెటర్ హాఫ్..

మన సంస్కృతి సంప్రదాయాల్లో భార్యకు ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఆమె లేని జీవితాన్ని ఊహించుకోలేం. ఊహించుకోండి.. నిత్యం ఇంటి పనులే కాదు భర్త, పిల్లల ఆలనాపాలన, కుటుంబ పెద్దల బాగోగులు చూసుకునే క్రమంలో తెల్ల వారింది మొదలు నిద్రపోయే వరకు ఎంతో శ్రమిస్తుంటారు. ప్రస్తుతమైతే మగవారితో సమానంగా ఉద్యోగ, వ్యాపార తదితర బాధ్యతల్లోనూ రాణిస్తున్నారు. ఈ క్రమంలో వారు పడుతున్న శ్రమకు ప్రతిఫలంగా భర్త నుంచి ప్రశంస అందితే చాలని చాలామంది మహిళలు అభిప్రాయపడుతున్నారు. కానీ ఈ విషయంలో భర్త నుంచి ఏమాత్రం ఓదార్పు లేదా ప్రశంస దక్కటం లేదని చాలా మంది ఆవేదన చెందు తుండటం గమనార్హం. పెళ్లి ఎప్పుడైందన్నది కాకుం డా భార్యను ఒక్కసారి మెచ్చుకోగలిగితే.. అంత కన్నా హ్యాపీ వైఫ్.. హ్యాపీ లైఫ్ ఇంకేం ఉండదని, అదే జీవితంలో బెటర్ హాఫ్ అని అభిప్రా యపడుతున్నారు.

● భాగస్వామి తాను పడిన శ్రమను మరిచిపోయేలా ప్రశంసించడమే కాదు వారు ఎంతో ఇష్టపడే బంగారు ఆభరణాలు, చీరలు, ఇతర సౌందర్య సాధనాలను బహుమతిగా ఇవొచ్చు. లేదంటే వంట నుంచి ఈ ఒక్క రోజున విశ్రాంతి ఇచ్చి భర్త ఆమెకు ఇష్టమైన వంటలు చేసి పెట్టొచ్చు. లేదంటే ఓ రెస్టారెంట్‌కు తీసుకెళ్లి, తనకు ఇష్టమైన ఆహారాన్ని ఆర్డర్ సర్‌ప్రైజ్ చేయవచ్చు. పువ్వులు, చాక్లెట్లు ఇలా వారికి నచ్చిన వాటితో ట్రీట్ ఇవ్వాలి. ఆమెను పొగుడుతూ ఓ కవితను రాయవచ్చు.

అంతేకాదు సోషల్‌మీడియాను వేదికగా చేసుకుని ఆమెను ప్రశంసిచొచ్చు. వైవాహిక జీవితం ప్రారంభ రోజుల నుంచి ఇప్పటి వరకు ఉన్న జ్ఞాపకాలు, ఫొటోలను ఒక పుస్తక రూపంలో తయారు చేసి బహుమతిగా ఇవ్వొచ్చు. రోజంతా వారితోనే పూర్తి సమయం కేటాయించగలిగితే.. ఆ ఒక్క రోజును వారు ఏడాదంతా గుర్తుంచుకుని కుటుంబబాధ్యతల్లో తాము ఎదుర్కొనే కష్టాలను సైతం మరిచిపోగలరని నిపుణులు చెబుతున్నారు.

కొనసాగుతున్న నవరాత్రోత్సవాలు


బాలాజీనగర్‌లో దీపోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు


రఘునాథపల్లిలో అన్నదానం చేస్తున్న భక్తులు


జఫర్‌గఢ్‌లో వినాయకుడికి శాకాంబరి పూజలు


గీతాశ్రమం వద్ద అన్నదానం చేస్తున్న భక్తులు

జనగామ కల్చరల్, సెప్టెంబరు 14: జిల్లాలో గణేష్ నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం స్థానిక బాలాజీనగర్‌లో వినాయక మిత్ర బృందం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినిన మండప ంలో భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక గీతాశ్రమం ఏరియాలో జరిగిన వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా వ్యాపారి తాళ్లపల్లి నాగరాజు ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. దశరథ, దేవరాజు, మహేశ్వర్, ప్రణీత్ పాల్గొన్నారు.

● నర్మెట : గణపతి నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహిం చుకోవాలని నర్మెట ఎస్సై నగేష్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మి నారాయణ, గుర్రాల దయాకర్‌రెడ్డి, భూపతిరెడ్డి పాల్గొన్నారు.

● జనగామ రూరల్ : గణపతి నవరాత్రోత్సవాలలో భాగంగా జిల్లా కేంద్రంలోని వీవర్స్ కాలనీలోని బాలభక్త ఆంజనేయ స్వామి సహిత భక్త మార్కండేశ్వర దేవాలయంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి గణనాథుని వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గుర్రం భూలక్ష్మి నాగరాజు, మునిసిపల్ ఛైర్ పర్సన్ పోకల జమున, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

● లింగాలఘణపురం : లింగాలఘణపురం మండల వ్యాప్తంగా శనివారం వినాయక నవరాత్రోత్సవాల సందర్భంగా మండపాల వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. వడ్డిచర్ల, లింగాలఘణపురం, నవాబుపేట, వడ్డిచర్ల, గ్రామాల్లో జరిగిన అన్నదాన కార్యక్రమానికి తాజా మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై భక్తులకు భోజనాలను వడ్డించారు. మండల ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● రఘునాథపల్లి : వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మండల కేంద్రంలోని పలు వినాయక మండపాల వద్ద శనివారం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బొల్లం అజయ్‌మణికంఠ, బాషుమియా, మండల కాంగ్రెస్ అద్యక్షుడు కోళ్ల రవిగౌడ్, కర్మికొండ ప్రదీప్, కోళ్ల రాజుగౌడ్, భాస్కర్, కిరణ్, సురేష్, అశోక్, రంగు రాజు, శోభన్, అన్వేష్ పాల్గొన్నారు.

● జఫర్‌గడ్ : శ్రీగణేశుడి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మండల కేంద్రమైన జఫర్‌గడ్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రతిష్ఠించబడిన వినాయక విగ్రహాల వద్ద ఉత్సవ కమిటీలు, భక్తులు నిత్య పూజలు, భజన కీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవ మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలను చేపడుతున్నారు. కూనూరులో శివాలయంలోని వినాయకుడి వద్ద ఉత్సవ కమిటీ నేతృత్వంలో కళాకారులతో గత రెండు రోజులుగా బుర్రకథా గానం చేస్తున్నారు. జఫర్‌గడ్‌లోని ఆర్యవైశ్య భవనంలో శ్రీగణేశుడికి శాకాంబరీ పూజా కార్యక్రమాలను నిర్వహిం చారు. మహిళలు 21 రకాల ఆకులు, పలు రకాల కూరగాయలతో మాలగా చేసి లంబోదరుడిని అలంకరించి.. భక్తి శ్రద్ధలతో పూజించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గందె సోమన్న, మహిళా ప్రతినిధులు అంచూరి కమల, దాంశెట్టి శ్రావ్య, అనూష, శ్వేత, స్వాతి, గీత, బజ్జూరి గీత, సుమ, సమత, అనిత పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా

● చిలుపూర్ : గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండల కేంద్రంలోని చిలుపూర్ గుట్టలో ఏర్పాటు చేసిన వినాయకుడిని టీవీ సీరియల్ నటుడు శ్రీ పవన్ ఆర్యవీర్ రాజ్‌పుత్‌తో పాటు, చిలుపూర్ ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ దర్శించు కున్నారు. గణేశుడి వద్ద ప్రత్యేక పూజలు చేసి మొక్కులు సమర్పించారు. ఈ సందర్భంగా బుగులు వెంకన్న ఆలయ ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవిందర్ శర్మ వేదమంత్రాలనాలపించారు. అనంతరం పూజా కార్యక్రమానికి హాజరైన భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పోలేపల్లి రంజిత్‌రెడ్డి, నారగోని రాజుగౌడ్, వీరన్న, గొల్లపల్లి వాసు, వైద్య నాగేందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


పాలకుర్తిలో మాట్లాడుతున్న లేగ రామ్మోహన్‌రెడ్డి

పాలకుర్తి, సెప్టెంబరు 14 : కేంద్ర ప్రభుత్వ ప థకాలను భార తీయ జనతా పార్టీ నాయకత్వం ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి లేగ రామ్మోహన్‌రెడ్డి కోరారు. శనివారం మండల కేంద్రంలోని ఆ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రతి ఆరేళ్ల కోసారి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జాతీయ పార్టీ నిర్వహిస్తోందని అన్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాల ప్రజల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని అన్నారు. ఈ పథకాలను మండల నాయకులు, శక్తి కేంద్రం ఇంచార్జీలు, ప్రతి బూత్ అద్యక్షులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమ్మగాని శ్రీకాంత్, సుకన్య కోటేశ్వరరావు, కడుదుల నిరంజన్‌రెడ్డి, రామారావు, రాణాప్రతాప్, సోమేశ్వర్, అమరేందర్, కొడిశాల యాదగిరి, రవి ఉన్నారు.

రాష్ట్రంలో రాక్షసపాలన సాగిస్తున్న రేవంత్‌రెడ్డి

-మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 14: రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి రాక్షసపాలనను సాగిస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య తెలిపారు. శనివారం డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పైన కాంగ్రెస్ గుండాలను ఉసిగొలిపి దాడులు చేస్తున్నాడని అందుకు నిదర్శనం అరికెపూడి గాంధీ ఆధ్వర్యంలో గుండాలు బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటిపైన దాడులు జరుగడమేనని తెలిపారు. సీఎంకు చిత్తశుద్ధి ఉంటే కౌశిక్‌రెడ్డి ఇంటిపైన దాడులు చేసిన 30మంది కాంగ్రెస్ గుండాల పైన కేసులు నమోదు చేయించాలన్నారు. కౌశిక్‌రెడ్డి ఇంటి పైన జరిగిన దాడి విషయమై మాజీ మంత్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లితే పోలీసులు హరీ‌ష్‌రావును అదుపులోకి తీసుకొని రాత్రంతా అడవులలో తిప్పడం దుర్మార్గమైనచర్య అన్నారు. ప్రజాపాలన అంటూ ప్రజల్ని హింసిస్తున్నారని తెలిపారు. పార్టీ ఫిరాయింపులపై 1985లో చట్టాన్ని రాజీవ్‌గాంధీ తీసుకువచ్చారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ నాయకుల కష్టంతో గెలిచి స్వప్రయోజనాల కోసం పార్టీ మారిన కడియం నీతి నిజాయితీ అంటూ మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. పార్టీ ఫిరాయింపుల విషయమై హైకోర్టు నాలుగు వారాల్లో చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్‌కు అదేశాలు ఇవ్వగా కడియం శ్రీహరి డివిజన్ బెంచ్‌కు, సుప్రీంకోర్టుకు వెళతాననడం సిగ్గుచేటు అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు మారపాక రవి, చాడ సరిత, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు మాచర్ల గణేష్‌గౌడ్, నాయకులు సేవెళ్లి సంపత్, మహేందర్ రెడ్డి, జయపాల్ రెడ్డి, పొన్నం రంజిత్‌గౌడ్, గంగుల శ్రీనివాస్ రెడ్డి, తాటికొండ సురేష్, కనకం గణేష్, చందర్ రెడ్డి, మనోజ్ రెడ్డి, రాంనర్సయ్య, కుంభం కుమార్, మారపల్లి ప్రసాద్, లకావత్ చిరంజీవి, గుండె మల్లేషం తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

సోదరభావాన్ని పెంపొందించుకోవాలి

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 14: ప్రతీ ఒక్కరు సోదరభావాన్ని పెంపొందించుకోవాలని ముస్లీం మతగురువులు మౌలానా అతీక్‌ఉర్ రహ్మాన్‌అసది, మౌలానా సయ్యద్ బిలాల్ అఫ్జల్ కాస్మిలు తెలిపారు. శనివారం మండలంలోని ఛాగల్ గ్రామంలోని మజీదులో జల్సా సీరద్ ఉన్ నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిధులుగా పాల్గొని మత గురువులు మాట్లాడారు. ముస్లీంలు ప్రతీ ఒక్కరు సోదరభావంతో మెలిగి ఐక్యతను చాటాలని కోరారు. ప్రతీ ముస్లీం మహ్మద్ ప్రవక్త బోధనలను అనుసరించాలని తద్వారా మానవుల్లో హింసాత్మక వైఖరి నశిస్తుందన్నారు. ఈ నెల 16న మీలాద్ ఉన్ నబీ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అయిమ్మా ఉలామ ఘన్‌పూర్ మండల ముస్లీం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సీజేఐటీలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే


సీజేఐటీలో గ్రాడ్యుయేషన్‌డే లో పాల్గొన్న విద్యార్థులు

జనగామ కల్చరల్, సెప్టెంబరు 14: జనగామ జిల్లా యశ్వంతాపురంలోని క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల (సీజేఐటీ)లో 23వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి సెయింట్ పీటర్ విద్యాసంస్థల డైరెక్టర్ ఎన్.నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన పట్టభద్రులైన విద్యార్థులను అభినందించి, వారి భవిష్యత్ ప్రణాళికను సరిగా నిర్ణయించుకోవాలన్నారు. గౌరవ అతిథిగా అభిజిత్, డైరెక్టర్ డి.విజయపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, విద్యార్థులు ఎం.శివరామకృష్ణ, ఎండి.మాజిద్, కె.జయంత్, బి.స్వాతి, పి.ప్రియ, సన్యాసిరావు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్

జనగామ కల్చరల్, సెప్టెంబరు 14: జిల్లాలో హిందీ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం జనగామ జిల్లా కేంద్రంలోని సెయింట్ మేరీస్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జైమోన్ థామస్ హిందీ సాహిత్య కవి గోస్వామి తులసీదాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హిందీ అధ్యాపకులు హిందీ నేర్చుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో పీఆర్వో రంగరాజు ప్రసాద్, రాజిరెడ్డి, జైపాల్‌రెడ్డి, శ్రీధర్, శ్రీనివాస్, నవీన్, రేష్మ, స్వాతి, మేఘన, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనం సమయంలో విద్యుత్ సమస్యలకు తావుండదు

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 14: వినాయక నిమజ్జనం సమయంలో డివిజన్ కేంద్రంలోని పుట్టలమ్మ చెరువు కట్టపైన విద్యుత్ సమస్యలకు తావులేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు టీఎస్ ఎన్పీడీసీఎల్ డీఈఈ గడ్డం గణేష్ తెలిపారు. శనివారం గణేష్ నిమజ్జనోత్సవాలను పురస్కరించుకొని పుట్టలమ్మ చెరువు కట్ట పైన జరుగుతున్న ఏర్పాట్లను శనివారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జనాలు రాత్రివేళల జరుగుతున్నందున విద్యుత్ సరఫరాకు ఎలాంటి అవంతరాలు రాకుండా అన్ని విధాల ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యేవరకు విద్యుత్ స్టిబంది అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ వంశీకృష్ణ, ఏఈ చంద్రమో హన్, ఈవో చుక్క లింగయ్య, సిబ్బంది శ్రీనివాస్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో అందని ద్రాక్షలా వైద్యం : సీపీఎం


చికిత్స పొందుతున్న యువతితో మాట్లాడుతున్న సీపీఎం నేతలు

బచ్చన్నపేట, సెప్టెంబరు 14: బచ్చన్నపేట ప్రభుత్వాస్పత్రిని అప్‌గ్రేడ్ చేయటం మినహా, సేవలందించటంలో విఫలమవుతున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సుంచు విజేందర్, మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్‌లన్నారు. శనివారం సీపీఎం బృందం ఆస్పత్రిని సందర్శించారు. చికిత్స పొందుతున్న వారితో మాట్లాడారు. సీఎస్‌సీగా అప్‌గ్రేడ్ చేసినప్పటికి వైద్యులను నియమించలేదని, ఉన్న వారికి సెలవులు మంజూరు చేశారని, వైద్యం కోసం వచ్చిన వారు ఊసురుమంటూ వెళుతున్నారని ఆరోపించారు. రాత్రి డ్యూటీ డాక్టర్లు అందుబాటులో లేకపోవటంతో రోగులు ఎవరు ఉండటం లేదన్నారు. పరీక్షలు చేయటానికి సరైన పరికరాలు లేవన్నారు. ఉద్యోగులు, వైద్యులు సమయపాలన పాటించేలా బయోమెట్రిక్ విధానం వెంటనే అమల్లోకి తీసుకురావలని, విధుల పట్ల నిర్లక్ష్యం చూపే వారిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను డిమా ండ్ చేశారు. నాయకులు మిన లాపురం ఎల్లయ్య, రామగళ్ల అశోక్, బలరా ం, రాములు, సమ్మయ్య, సుధాకర్, నర్సింహ్మస్వామి తదితరులున్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం


గ్యాస్ పత్రాలను మహిళలకు అందిస్తున్న గంగం నర్సింహరెడ్డి

నర్మెట, సెప్టెంబరు 14 : ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహరెడ్డి అన్నారు. ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా రూ. 500కే అందిస్తున్న గ్యాస్ పత్రాలను శనివారం మహిళలకు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మినారాయణ, నాయకులు చెవుల పరుశరాములు, భూపతిరెడ్డి, కొన్నె అంజయ్య, వంగాల గోవర్ధన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రెండో వసంతంలోకి..!

(3వ పేజీ తరువాయి)

కిందకు వస్తాయి. మొత్తంగా వంద సీట్లలో మొదటి సంవత్సరంలో 71 మంది విద్యార్థినులు, 29 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. కాగా.. ఈ ఏడాది కొత్తగా మొదటి సంవత్సరంలో మరో వంద మంది ప్రవేశాలు పొందనున్నారు. ప్రస్తుతం మొదటి ఏడాది ప్రవేశాలలో భాగంగా జాతీయ కోటా కౌన్సిలింగ్ ప్రక్రియ జరుగుతుండగా, రాష్ట్ర కోటా కౌన్సిలింగ్ ప్రక్రియలో కొంత స్తబ్ధత నెలకొంది. స్థానికత విషయంలో కోర్టులో కేసు ఉండడంతో రాష్ట్ర కోటా సీట్ల కౌన్సిలింగ్ కొంత ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. ఈ కౌన్సిలింగ్ పూర్తయితే రెండో ఏడాది విద్యార్థులతో పాటు కొత్తగా వచ్చే 100 మంది విద్యార్థులతో మొత్తంగా విద్యార్థుల సంఖ్య 200కు చేరనుంది.

అందరి సహకారంతోనే..

- జనగామ మెడికల్ కాలేజీ విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకోవడంలో అందరి సహకారం ఉంది. బోధనాసుపత్రుల సూపరింటెండెట్ల సహకారం, ఫ్యాకల్టీ సహకారం మరువలేనిది. జనగామ మెడికల్ కాలేజీలో మంచి అనుభవమున్న బోధనా సిబ్బంది ఉన్నారు. మొదటి సంవత్సరం పూర్తి చేసుకొని రెండో సంవత్సరంలోకి అడుగు పెడుతున్నాం.

- డాక్టర్ గోపాల్‌రావు, ప్రిన్సిపాల్, మెడికల్ కాలేజీ

ఆలయ భూములను ఆక్రమిస్తే కఠినచర్యలు

చిలుపూర్, సెప్టెంబరు 14 : దేవాదాయ శాఖ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని యాదాద్రి భువనగిరి డివిజన్ ఎండోమెంట్ ఇన్స్‌పెక్టర్ ఎం. విజయలక్ష్మి హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని చిలుపూర్ గుట్ట బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయ భూముల్లోకి కొందరు వ్యక్తులు చొరబడి హద్దురాళ్ళను తొలగించడంతో పాటు, ఆక్రమణలకు పాల్పడుతున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి ఆమె చిలుపూర్ గుట్టను సందర్శించారు. గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 229లో చదును చేసిన స్థలాలను ఆమె పరిశీలించారు. అట్టి స్థలంలో తక్షణమే హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇన్స్‌పెక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, ఆలయ భూముల్లో ఆక్రమణలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదన్నారు. హద్దురాళ్ళను తొలగించిన వ్యక్తులను గుర్తించి వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈవో మోహన్‌బాబు, జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, రికార్డ్ అసిస్టెంట్ వీరన్న, విశాల్, గాదె రాజశేఖర్ పాల్గొన్నారు.

భారీ భద్రతా ఏర్పాట్ల మధ్య నిమజ్జన ఏర్పాట్లు

- 400 విగ్రహాలు.. 200 మంది పోలీసులు

లింగాలఘణపురం, సెప్టెంబరు 14: ఆదిదేవుడు గణనాథుడి నవరాత్రోత్సవాలు ముగిసిపోవడంతో నిమజ్జనోత్సవానికి అధికారులు భారీ ఏర్పాట్లను చేపడుతున్నారు. జనగామ జిల్లా కేంద్రంలోని 320 పైచిలుకు విగ్రహాలతో పాటుగా నెల్లుట్ల పరిసర గ్రామాలకు చెందిన మరో 80 విగ్రహాలను నెల్లుట్ల పెద్ద చెరువులో నిమజ్జనం చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా నేతృత్వంలో మునుపెన్నడూ లేనంతగా భారీ బందోబస్తు నడుమ నిమజ్జన ఏర్పాట్లకు అధికారులు సిద్ధమయ్యారు. మొత్తంగా 400 విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు సుమారుగా 200 మంది పోలీస్ సిబ్బంది విధులు నిర్వర్తిం చేందుకు పోలీస్ శాఖ భారీ ఏర్పాట్లను చేపట్టింది. జనగామ ఏసీపీతో పాటుగా నలుగురు సీఐలు, 10 మంది ఎస్సైలు, పోలీసులు, ఏఎస్సైలు, హెడ్‌కాని స్టేబుళ్ళ, కానిస్టేబుళ్ల హోంగార్డులు మొత్తంగా కేవలం పోలీస్ శాఖ నుంచే 200 మంది నిమజ్జనోత్సవాల్లో పాల్గొననున్నారు. అంతేకాకుండా విద్యుత్ శాఖాధికారులు ఎస్ఈ, డీఈ, ఏడీఈ, ఏఈలు, లైన్‌మెన్లు, ఏఎల్ఎంలు. జేఎల్ఎంలు, రెవిన్యూశాఖాధికారులు, నీటిపారుదల శాఖాధి కారులు, మున్సిపల్ శాఖాధికారులు, మొత్తంగా 100కు పైగా పలుశాఖల అధికారులు నిమజ్జనోత్సవ వేడుకల్లో విధులు నిర్వర్తించేందుకు సిద్ధమయ్యారు. నెల్లుట్ల చెరువు వద్ద రెండు భారీ క్రేన్లు, రెండు తెప్పలు, దారిపొడవునా శోభాయాత్రకు అనుకూలంగా ధగధగ శోభాయమానంగా మెరిసే విద్యుత్‌దీపాలు, బారికేడ్లు ఏర్పాటు చేసేందుకు అధికారులు మూడు రోజులుగా శ్రమిస్తున్నారు. చెరువు నీటిలో వాహనాలు కూరుకుపోకుండా ఉండేందుకు ప్రత్యేకంగా తాత్కాలిక రోడ్డును నిర్మించారు. ఏది ఏమైనా ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లారేదాకా జరిగే నిమజ్జన వేడుకల్లో ఎలాంటి అపశృతులు, అవాంఛనీయ ఘటనలకు తావులేకుం డా శోభాయాత్ర వెంట పోలీస్ పుషింగ్ టీంలను డీసీపీ రాజమహేంద్రనాయక్ సిద్ధంగా ఏర్పాటు చేశారు. నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా ప్రజలు అధికారులకు సహకరించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, డీసీపీ రాజమహేంద్రనాయక్ విజ్ఞప్తి చేశారు.


నెల్లుట్ల చెరువులో తాత్కాలిక రోడ్డు వేస్తున్న దృశ్యం

కారు తగిలి విద్యార్థికి గాయాలు

బచ్చన్నపేట, సెప్టెంబరు 14: బచ్చన్నపేట-తమ్మడపల్లి గ్రామాల మధ్య మొండికుంట వద్ద గల తుమ్మబాల హైస్కూల్‌కు చెందిన విద్యార్థి శనివారం బస్సుకోసం ఎదురు చూస్తుండగా, అతి వేగంగా వచ్చిన కారు మిర్రర్ తగిలి తీవ్ర గాయాలయ్యాయి. ఆలీంపూర్ గ్రామానికి చెందిన చెంచు రిషిక్ తుమ్మబాల పాఠశాలలో నాలుగోతరగతి చదువుతున్నాడు. సాయంత్రం బస్సు కోసం ఎదురు చూస్తున్న క్రమంలో జనగామవైపు నుంచి అతి వేగంగా వచ్చిన కారు కోర్టు పక్కనున్న రిషిక్‌ను తాకుతూ వెళ్లిపోయింది. అక్కడే ఉన్న సీపీఎం నేతలు బాలున్ని జనగామ ఆస్పత్రికి తరలించి పీఎస్‌కు సమాచారం అందించారు. తీవ్ర గాయాలైన బాలుడికి మెరుగైన వైద్యం అందించాలని మాజీ ఎంపీటీసీ ఎండీ మసూద్ వైద్యులను కోరారు.

20న రిజర్వ్ ఫారెస్ట్‌లోని సీతాఫలాల వేలం

బచ్చన్నపేట, సెప్టెంబరు 14:మండలంలోని మన్‌షాన్‌పల్లి, సాల్వాపూర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉన్న సీతాఫలాల చెట్ల నుంచి కాయలను సేకరించుకునే హక్కు కోసం ఈ నెల 20న మన్‌షాన్‌పల్లిలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు జనగామ అటవీక్షేత్రాధికారి కొండల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ. 5 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. పాల దక్కని వారికి తిరిగి ఇవ్వబడుతుందని, తగిన వేలం రానిచో వాయిదా వేయడం జరుగు తుందన్నారు.

లబ్ధిదారులకు మహాలక్ష్మీ పత్రాలు అందజేత

బచ్చన్నపేట, సెప్టెంబరు 14: తెలంగాణ ప్రభుత్వం మహాలక్ష్మీ పథకం కింద రూ. 500 గ్యాస్ సబ్సిడీ ఇస్తున్న విషయం తెలిసిందే. సంబంధిత పత్రాలను ఇంటింటికి అందజేసేందుకు రేషన్ డీలర్లు, పంచాయతీ కార్యదర్శులకు అప్పగించినట్లు ఎంపీడీవో మల్లిఖార్జున్ తెలిపారు. మండలంలో సబ్సిడీ పొందుతున్న కుటుంబాలు 5853 ఉన్నాయన్నారు. వారందరికి ఇంటి వద్దకు వచ్చి పత్రాలు అందజేస్తారని తెలిపారు. కాగా అన్ని గ్రామాల్లో పత్రాలు అందించే కార్యక్రమం ప్రారంబమైందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

చిలుపూర్, సెప్టెంబరు 14 : రోడ్డు ప్రమాదంలో సైకిల్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డ ఘటన మండలంలోని రాజవరం సమీపంలో చిన్నపెండ్యాల - తరిగొప్పుల ప్రధాన రహదారిపై జరిగింది. శనివారం ఎస్సై సిరిపురం నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన జక్కుల కొమురయ్య తాటికాయల గ్రామానికి వెళ్ళే రోడ్డులో ఉన్న తన వ్యవసాయ పొలానికి సైకిల్ పై వెళ్ళి తిరిగి వస్తుండగా, చిన్నపెండ్యాల నుంచి మల్కాపూర్ వైపు వేగంగా వెళ్తున్న ఎర్టిగా కారు సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సైకిల్‌పై వెళ్తున్న కొమురయ్య కిందపడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

చిలుపూర్, సెప్టెంబరు 14 : భూతగాదా నేపథ్యంలో మూడున్నరేళ్ళ క్రితం జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడ్డ ఓ వ్యక్తి అప్పటి నుంచి ఆస్పత్రిలో, ఇంట్లో ప్రత్యేకంగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందిన సంఘటన మండలంలోని కృష్ణాజీ గూడెంలో జరిగింది. స్థానిక ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన ఊరడి నాగరాజు(30)తో పాటు, అదే గ్రామానికి ఊరడి శ్రీహరి, శ్రీనివాస్‌కు మధ్య భూ తగాదాలు ఉండడంతో, మూడేళ్ళ క్రితం పరస్పరం భౌతిక దాడులకు పాల్పడ్డారు. ఆ సమయంలో నాగరాజు తలకు తీవ్ర గాయమైంది. అప్పటి నుంచి అపస్మారకస్థితిలోకి వెళ్ళిన ఆయన ఆస్పత్రితో పాటు, ఇంట్లోను చికిత్స తీసుకుంటున్నాడు. పరిస్థితి విషమించడంతో శనివారం ఉదయం మృతిచెందాడు. మృతుడు నాగరాజుకు భార్య శారదతో పాటు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మండల పాస్టర్ల కమిటీ ఎన్నిక

రఘునాథపల్లి, సెప్టెంబరు 14: మండల కేంద్రంలోని కర్మెల్ బాప్టిస్ట్ చర్చిలో నియోజకవర్గం పాస్టర్ల కమిటీ కో-ఆర్డినేటర్ బాలస్వామి ఆధ్వర్యంలో శనివారం మండల పాస్టర్ల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెరుపల్లి రాజు, ఉపాధ్యక్షుడిగా గందమల్ల డానియేలు, జనరల్ సెక్రెటరీగా నల్ల సుకుమార్, జాయింట్ సెక్రటరీగా బొల్లెపల్లి వెంకట్, ట్రెజరర్‌గా కొండ థామస్ ఎన్నికయ్యారు. కమిటీ మెంబర్లుగా పన్నీరు సుధాకర్, గుర్రపు వెంకటస్వామి, సలహాదారులుగా జోసఫ్, ఎడ్ల మాజాస్, తోపునూరి సంతోష్, ప్రభాకర్, మార్క్ ఎన్నికయ్యారు.

బాధిత కుటుంబీకులకు పరామర్శ

జఫర్‌గడ్, సెప్టెంబరు 14 : ఆత్మహత్యకు పాల్పడిన మండలంలోని ఉప్పుగల్లుకు చెందిన టెన్త్ విద్యార్థి కొడారి రాజ్‌కుమార్ మృతదేహం వద్ద స్థానిక మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య నివాళులు అర్పించారు. పార్టీ నాయకులతో కలిసి ఆయన రాజ్‌కుమార్ మృతదేహానికి పూలమాల వేసి సంతాపం వ్యక్తం చేశారు. అలాగే ఇటీవల మృతి చెందిన ఇదే గ్రామానికి చెందిన బుర్ర సుశీల ఆయన వెంట బీఆర్ఎస్ నియోజకవర్గ కన్వీనర్ మారపాక రవి, కో-ఆర్డినేటర్ పసునూరి మహేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పి.జయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల కమిటీ

తరిగొప్పుల, సెప్టెంబరు 14: కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ తరిగొప్పుల మండల కమిటీని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఏకగ్రీవంగా నియమించి వారికి శనివారం నియామకపత్రం అందజేశారు. ఎస్టీ సెల్ మండల కోఆర్డినేటర్‌గా సలావత్ అల్పతినాయక్, మండల అధ్యక్షుడుగా లావుడ్య భీమానాయక్, ఉపా ధ్యక్షులుగా బోనోతు భీమాచంద్, భూక్యా బాస్కర్, ప్రధాన కార్యదర్శిగా భూక్య గోవింద్, కోశాధికారిగా గుగులోతు శంకర్‌నాయక్‌లు నియామకమయ్యారు.

జనగామకు నర్సింగ్ కళాశాల

జనగామ రూరల్, సెప్టెంబరు 14: జనగామకు నర్సింగ్ కళాశాలను మంజూరు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటన ద్వారా ధన్యవాదాలు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హడావిడిగా కొన్ని మెడికల్ కళాశాలు, నర్సింగ్ కళాశాలను మాంజూరు చేసి కనీస వసతులు, ఆధ్యాపకులు లేకుండా ప్రజలను తప్పుదోవ పట్టించారన్నారు. జనగామకు నర్సింగ్ కళాశాలను మంజూరు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు.

విషజ్వరంతో బాలిక మృతి

జఫర్‌గడ్, సెప్టెంబరు 14 : మండలంలోని ఓబులాపూర్‌లో స్థానిక కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వంగా దయాకర్ కుమార్తె తణుశ్రీ (4) విష జ్వరంతో మృతి చెందగా.. శనివారం జఫర్‌గడ్ సొసైటీ చైర్మన్ టి.కరుణాకర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య, తదితర నేతలు నివాళులు అర్పించారు. బాలిక మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. సేవాదళ్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి మామిడాల సోమనారాయణ, ప్రభాకర్‌రెడ్డి, మహేందర్, తదితర నేతలు, గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవ వేడుకలు

లింగాలఘణపురం, సెప్టెంబరు14: జాతీయ హిందీ భాషా దినోత్సవ వేడుకలను లింగాలఘణపురం మండలం బండ్లగూడెం కేజీబీవీ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా హిందీ బాషా ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం స్పెషల్ ఆఫీసర్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ హిందీ భాషను సులభంగా సరళంగా నేర్చుకోవచ్చన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లకు ప్రశంసా పత్రాలు


ఉద్యోగులకు ప్రశంస పత్రాలను అందజేస్తున్న డిపో మేనేజర్ స్వాతి

జనగామ రూరల్, సెప్టెంబరు 14: జనగామ ఆర్టీసీలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన డ్రైవర్లను డిపో మేనేజర్ ఎస్.స్వాతి శనివారం ఘనంగా సన్మానించారు. ప్రగతి చక్ర అవార్డుకు ఎంపికైన ఉత్తమ డ్రైవర్లను జనగామ ఆర్టీసీ డిపోలో శనివారం డిపో మేనేజర్ ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ స్వాతి మాట్లాడుతూ ఇందన పొదుపు చేసి డ్రైవర్లు, కడక్టర్లను సన్మానించడం జరిగిందన్నారు. డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపరాదని ప్రయాణికుల మన్ననలు పొందుతూ డిపోకి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

తెప్పను పరిశీలించిన సీఐ

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 14: డివిజన్ కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొల్పిన వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయడంలో భాగంగా డివిజన్ కేంద్రంలోని పుట్టలమ్మ చెరువు వద్ద నిమజ్జనోత్సవానికి జరుగుతున్న ఏర్పాట్లను సీఐ జి .వేణు శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో ఈవో చుక్క లింగయ్య, సిబ్బంది శ్రీనివాస్‌గౌడ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.